క్లుప్తంగా

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంజీవ రెడ్డి రాధాకృష్ణ, అధ్యాపకులు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని జవాయిపల్లిలో రైతు కుమ్మరి గోపాల్‌కు సంబంధించిన గడ్డివాము దగ్ధమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ పొలం దగ్గర ఉన్న వాముకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి వాము దగ్ధమైందని పేర్కొన్నారు. బుధవారం పోలీసుస్టేషన్‌తో పాటు తహసీల్దార్ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాదాపు రూ.40 వేల వరకు నష్టం వాటిల్లిందని వివరించారు.

లింగాల: మండలంలోని పద్మన్నపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గుడిసెలు, పశుగ్రాసం దగ్ధమై రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ప్రమాదవశాత్తు పశుగ్రాసానికి నిప్పంటుకోవడంతో పక్కనే ఉన్న గుడిసెలకు మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో జాజాల ఈదన్న, జాజాల నారాయణ, బిచ్చయ్య సంబంధించిన గుడిసెలు, పశుగ్రాసం దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అచ్చంపేట నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశాయి.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

కొల్లాపూర్: ఉద్యమాలతోనే పేదల సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో రెడ్ బుక్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ రాసిన విప్లవాయుధం పుస్తకంలోని పలు వ్యాసాలపై చర్చించారు. కమ్యూనిస్టుల ద్వారా పేద, మధ్య తరగతి సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీమ్, ముంతాజ్ అలీ, రాజు తదితరులున్నారు.

రేపు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక



ఊర్కొండ: విజయ సంకల్ప యాత్రలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం మండలానికి చేరుకోనుందని జడ్చర్ల బీజేపీ నాయకులు ప్రభారి, అజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీబాలాత్రిపుర సుందరి, జడ్చర్ల కన్వీనర్ పులమోని నర్సింహులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 23న కేంద్ర మంత్రి రైతులతో ముఖాముఖిగా మాట్లాడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఓర్సు ఆంజనేయులు, నాగర్‌కర్నూలు బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్ మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కల్వకుర్తిరూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలలో తరగతులు బహిష్కరించి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లతో పాటు విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

నాప్కిన్స్ పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు హైదరాబాద్ క్లాస్‌మెట్ క్లబ్ మహిళా అధ్యక్షురాలు పెండ్యాల కవిత పుట్టిన రోజు సందర్భంగా ఆమె సమకూర్చిన నాప్కిన్స్ ఆ క్లబ్ సభ్యులు బుధవారం పంపిణీ చేశారు. కొల్లాపూర్ డివిజన్ క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కాశీపురం మహేష్, ఉపాధ్యక్షుడు మొబైల్స్ రాయుడు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి పాఠశాల విద్యార్థులకు బుధవారం కొట్ర ప్రవీణ్, సంధ్యల పెళ్లిరోజు సందర్భంగా సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాస రాఘవేందర్ 133 మందికి పరీక్ష ప్యాడులు, పెన్నులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

సాక్షి, నెట్‌వర్క్: తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తాడూరు ఉన్నత పాఠశాల జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రశ్నాపత్రాన్ని మండల నోడల్ అధికారి బలరామకృష్ణారావు విడుదల చేశారు. మండల స్థాయిలో గెలిచిన విద్యార్థులను విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అభినందించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కరువు

- అసంపూర్తిగా వంటశాల
- నెలలు గడుస్తున్నా పూర్తికాని పనులు



పాఠశాల ఆవరణలో భోజనం చేస్తున్న విద్యార్థులు



వెల్దండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంటశాల

వెల్దండ: పాఠశాలల బలోపేతం కోసం మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బడుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం సరిపడ నిధులు కేటాయించింది. కాని క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులు పూర్తికాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న వంటశాల షెడ్డు మన ఊరు– మన బడి కింద ఏడాది కిందట శంకుస్థాపన చేశారు. మొదట్లో పిల్లర్ల పనులు పరిమితం అయ్యాయి. సకాలంలో పనులు పూర్తి కాక విద్యార్థులకు ఆరుబయటే మధ్యాహ్న భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

నిధులు మంజూరైనా..

పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలు, అదనపు తరగతి గదులు, పాఠశాల ప్రహరీ, మూత్రశాలలు తదితర వాటిని నిర్మించడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేశారు. ఆయా పాఠశాలల్లో పనులను ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత విద్యా సంవత్సరంలో పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉన్నా పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రారంభించిన పనులు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి అయ్యేలా కనిపించటం లేదు.

మోడల్ స్కూల్‌లో అవస్థలు

పాఠశాలల్లో దాదాపుగా 600 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రారంభం నుంచి భోజనశాల నిర్మించలేదు.విద్యార్థులు ఆరు బయట కూర్చొని భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో అవస్థలు అంతాఇంతా కాదు. వంట చేసేందుకు సరిపడ గదులు లేకపోవడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి పాఠశాలల్లో భోజనశాల, వంట గదులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చెట్లకిందే భోజనం చేస్తున్నాం



పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం చెట్ల కిందే చేస్తున్నాం. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు భోజనశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు ఇచ్చాం. కాని ఫలితం లేదు. వర్షాకాలంలో భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి భోజనశాల వెంటనే మంజూరు చేయాలి.

–శిల్ప, 10వ తరగతి, విద్యార్థి, వెల్దండ

పనులను పూర్తి చేయిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. మొదటి విడతలో వెల్దండ, పెద్దాపూర్ ఉన్నత పాఠశాలల్లో భోజనశాలలను నిర్మించడానికి ప్రభుత్వం ఎంపిక చేసి నిధులను మంజూరు చేసింది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే ప్రారంభించేల చర్యలు తీసుకుంటాం.

– శంకర్‌నాయక్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, వెల్దండ

ఘనంగా మాతృభాషా దినోత్సవం

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని సందర్భంగా తెలుగు భాష పండితులు ఆంజనేయులును బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మాతృభాషను మరుచిపోవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ అధ్యాపకుడు అమృత్‌కుమార్ హాజరై మాట్లాడారు. మాతృభాష గొప్పతనాన్ని వెలకట్టలేమన్నారు. ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ మాట్లాడుతూ విదేశీ భాషల మోజులో పడి మాతృభాషను మర్చిపోవద్దన్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, తెలుగు అధ్యాపకులు జగన్నాథం, పాల్గొన్నారు.



కాంసానిపల్లి విద్యార్థినికి సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని చిమ్మపూడి ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు బహుమతిగా అందజేశారు. హెచ్‌ఎం విజయ్‌కుమార్, సరళ, అంబిక, అంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న రామస్వామి

మన్ననూర్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమ్రాబాద్ మండలం మాచారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం డీటీఎఫ్ ఉమ్మడి అమ్రాబాద్ మండలాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడి సమక్షంలో అమ్రాబాద్, పదర మండలాలకు సంబంధించిన డీటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమ్రాబాద మండల డీటీఎఫ్ అధ్యక్షుడుగా విస్లావత్ తిరుపతయ్య, ఉపాధ్యక్షుడుగా రమేష్, ప్రధాన కార్యధర్శి విజయ్ చందర్, జిల్లా కౌన్సిలర్‌గా ఎల్లయ్య, పాండయ్య, రాజు, కార్యధర్శులుగా సురేష్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా పదర మండల కమిటీ అధ్యక్షుడుగా మహేష్, ఉపాధ్యక్షులుగా నందిని, పరుశురామ్, ప్రధాన కార్యధర్శిగా కిషన్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యాయులు మహేష్, ఉదయ్‌కుమార్, మంత్రు, శాంతి, వెంకటయ్య, జైపాల్, విజయ్‌మోహన్, శంకర్, అలీంలు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన



ఆయిల్ ఫాం తోటలను పరిశీలిస్తున్న అధికారులు

తాడూరు: ఆయిల్‌పాం తోట సాగుపై బుధవారం ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మండలంలోని మేడిపూర్‌లో రైతు వెంకట్‌రెడ్డి సాగు చేసిన ఆయిల్ పాం తోటల సాగును ఐఐటీపీఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు పరిశీలించారు. పంట సాగుపై యాజమాన్య పద్ధతులు, నర్సరీలో చేపట్టాల్సిన చర్యలు, ప్రధాన పొలంలో మొక్కలు నాటు విధానం, నీటి, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. లేత ఆయిల్ పాం తోటలకు ఆశించిన మొవ్వ కుళ్లు, తెగుళ్ల వాటి నివారణ, మెడవిరిపు తెగుళ్ల వంటి చర్యలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె సురేష్, ఉద్యానవన శాఖ జేడీ సరోజినీదేవీ, ఏడీ లహరి, జిల్లా అధికారి సురేష్, ఆయిల్ పాం కంపెనీ సభ్యులు రామ్మోహన్, టెక్నికల్ మేనేజర్ ఫణకుమార్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

'విజయసంకల్ప యాత్ర' పోస్టర్ విడుదల



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయసంకల్ప యాత్ర శుక్రవారం పట్టణానికి చేరుకోనున్న సందర్భంగా భాగంగా బుధవారం బీజేపీ కార్యాలయంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆచారీ మాట్లాడుతూ మూడవసారి మోదీని ప్రధానమంత్రిని చేద్దామన్నారు. 23 తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మార్చాల నుంచి పాలమూరు చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తా, ఎల్లికల్ చౌరస్తాల మీదుగా బైక్ ర్యాలీ శివాజీ చౌక్ వద్దకు చేరుకుంటుందన్నారు. శివాజీ చౌక్‌లో సాయంత్రం 6 గంటలకు కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశామని కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో విజయసంకల్ప యాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, సురేందర్‌గౌడ్, అభిలాష్‌రెడ్డి, కృష్ణగౌడ్, బాబీదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వేషధారణతో అలరించారు. తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. సమావేశంలో హెచ్‌ఎం వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్ ప్రసాద్, జైపాల్, ఆంజనేయులు, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులు, పాండు తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీడీఓ కమలాకర్ రెడ్డి ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఓ శంకర్, ఏసీఓ తిరుపతయ్య, హెచ్‌డబ్ల్యూ తిరుపతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లోని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అయి 26వ తేదీన ముగుస్తాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సత్యం, శ్రీనివాసులు, విజ్ఞయ్య, అర్చకుడు భవనాచార్యులు తెలిపారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు మాఘశుద్య పౌర్ణమి రోజు వరకు ఉంటుందని వివరించారు. నెల రోజుల పాటు జాతర కొనసాగుతుందని పేర్కొన్నారు. 22న స్వామివారికి గరుడ వాహన సేవ, 23న శ్రీదేవీ, భూదేవీ, వేంకటేశ్వర స్వామిల కల్యాణం, 24న రథోత్సవం, 25న అశ్వవాహన సేవ, 26న హంస వాహన సేవ, చక్రతీర్థం, బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

డీటీఓకు సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా రవాణా శాఖ అధికారి చిన్నబాలుని రవాణా రంగ కార్మికులు బుధవారం శాలువాతో సన్మానించారు. జిల్లా శివారులోని డీటీఓ కార్యాలయంలో డీటీఓను నాయకుడు పాదిల రామయ్య కార్మికులతో కలిశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 25 లక్షల మంది రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు కావడం లేదని వివరించారు. ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. 2019లో తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కురుమూర్తి, నాగరాజు, శేషు, వెంకటేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక జనరల్ ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ చూసే ఎస్‌ఎస్‌సీ ఏజెన్సీ అవినీతి అక్రమాలపై విచారణ చేసి సంబంధిత కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పారిశుద్ధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. అనంతరం జీఓ నంబర్ 60 ప్రకారం పెరిగిన కొత్త వేతనాలను అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పి సురేష్ మాట్లాడుతూ శానిటేషన్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం రూ.10200 వేతనం చెల్లించాల్సి ఉన్నా ఏజెన్సీ నిర్వాహకులు 2017 నుంచి రూ. 7600 చెల్లించి శ్రమదోపిడీకి పాల్పడుతన్నారన్నారు. ఏజెన్సీ నిర్వాహకులపై దర్యాప్తు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి శివశంకర్, శ్రీనివాస్, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



చెక్కు అందజేస్తున్న వారణాసి రంజిత్

కందనూలు: మండలంలోని శ్రీపురంలో నాబార్డ్ వారి సౌజన్యంతో బుధవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిజీవీబి రీజినల్ మేనేజర్ వారణాసి రంజిత్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలను వివరించారు. ఖతాదారులు సామాజిక భద్రత పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి బైక్ ప్రమాదంలో మరణించడంతో స్త్రే అతనికి 24 లక్షల బీమా మంజూరయ్యిందన్నారు. ఈ మేరకు మృతుడి భార్య కృష్ణవేణికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ హరీష్, ఫీల్డ్ ఆఫీసర్లు శివరామకృష్ణారెడ్డి, అయ్యప్ప, బ్యాంకు మిత్రలు ఆంజనేయులు, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్ కౌసిల్ కుమార్ పాండే, సురేష్ రెడ్డి, హరీష్, ఫీల్డ్ ఆఫీసర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

లింగాల: తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా శాఖ అధికారి సృజన్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసులో బీపీఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ బీమా పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



వేరుశనగ ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఉపసంచాలకులు సింగారెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: వేరుశనగ రైతులు తప్పనిసరి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వ్యవసాయశాఖ ఉపసంచాలకులు సింగారెడ్డి రైతులకు సూచించారు. వారం రోజులుగా వేరుశనగ రైతులు ధర విషయంలో ఆందోళన చేపడుతున్నందున ప్రభుత్వ సూచనల మేరకు బుధవారం నాగర్‌కర్నూల్ మార్కెట్‌ను సందర్శించి అమ్మకానికి వచ్చిన వేరుశనగ ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సింగారెడ్డి మాట్లాడుతూ తక్కువ ధర వచ్చిన రైతులు వాటిని అమ్మకుండా తేమ శాతాన్ని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తే సరైన ధర వస్తుందని అన్నారు. బుధవారం మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ దాదాపు 7వేల వరకు ధర వచ్చిందన్నారు. రైతులు కమీషన్ ఏజెంట్లు, ఖరీదుదారులతో సమావేశం ఏర్పాటుచేసి వేరుశనగ నాణ్యతా ప్రమాణాలపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఆఫీస్ ఆఫ్ కమీషనర్ వైజే పద్మహర్ష, ఉపసంచాలకులు మార్కెటింగ్ శాఖ మరియు అధికారులు రమేష్, బాబు, డివిజనల్ వ్యవసాయ శాఖ అధికారి బాలమణి, మార్కెటింగ్ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



అచ్చంపేట రూరల్: ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం అచ్చంపేటలో ఎమ్మెల్యేను మాల ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విడతల వారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జీవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జనార్దన్, గౌరవాధ్యక్షుడు నారాయణ, అధ్యక్షుడు కల్ములల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి శంకర్, ముఖ్య సలహాదారులు రామస్వామి, లింగమయ్య, బాలయ్య, రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సైదులు, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఆడిటర్లు మనోహర్, కుమార్, ప్రచార కార్యదర్శులు లక్ష్మయ్య, నిరంజన్, కార్యనిర్వాహక కార్యదర్శులు వెంకటేష్, నాసర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో బుధవారం చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో గణపతి పూజ, పుణ్యవచనం, పంచగవ్య ప్రాసన, రక్షా దీక్ష దారణ, ధ్వజ అభిషేకాలు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పూజారి పుచ్చ అనురూప్ శర్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నందికోళ్ల సేవ



కందనూలు: జిల్లా కేంద్రంలో వీరభద్రస్వామి విగ్రహ ఊరేగింపు, నందికోళ్ల సేవ బుధవారం శివ దీక్ష గురు స్వామి పలుస విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా మార్కెట్ శివాలయంలో స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో ఆఫీసు, బస్టాండ్, శ్రీపురం చౌరస్తా, నాగనూలు చౌరస్తా, కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపు కార్యక్రమం కొనసాగింది. స్వాములు శూలాలు గుచ్చుకొని విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో పాండురంగయ్య గుప్తా, కోటేశ్వర్, రాజారత్నం, వంశీ, రాజు, నాగేశ్వర్, విక్రమ్, వినయ్, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

ఉప్పునుంతల: తాగునీటి సమస్య రాకుండ చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండ షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. విశ్వకర్మ పథకంపై చర్చించారు. సమావేశంలో ఎంపీఓ నారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చారకొండ: మండలంలోని అగ్రహారం తండాకు చెందిన పంచాయతీ సిబ్బంది దిప్లాల్ కూతురు వివాహానికి మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్ బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న గడువు

వెల్దండ: ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉందని ఏఈ సూర్యం నాయక్ పేర్కొన్నారు. అర్హులైన వారందరు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్‌నెంబర్, ప్రజాపాలన దరఖాస్తులు ఇవ్వాలన్నారు. మండలంలో మొత్తం 7100 సర్వీస్ నెంబర్లు ఉండగా ఇప్పటి వరకు 5150 వరకు దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వృద్ధులకు అందించే సంచార వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మంతటిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 92 మంది వృద్ధులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

గోల్డ్‌మెడల్ సాధించిన నల్లమల విద్యార్థిని

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రగతి ఎంఈడీ కళాశాలకు చెందిన కపిలవాయి శ్వేత పాలమూరు యూనివర్సిటీ నుంచి గోల్డ్‌మెడల్‌కు ఎంపికైంది. పీయూ ప్రకటించిన 2023 సంవత్సరానికి గానూ ఎంఈడీలో 82.25శాతం మార్కులు సాధించిన నల్లమల విద్యార్థి శ్వేతకు గోల్డ్‌మెడల్ వరించింది. బుధవారం కళాశాల కరస్పాండెంట్లు నాగయ్య, జగపతిరావు, ప్రిన్సిపాల్ ఇబ్రహీం సమక్షంలో విద్యార్థినిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, ప్రకాష్, జయమ్మ పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

కల్వకుర్తి: టీఎస్‌పీఎస్సీ ఇటీవల విడుదల చేసిన టీపీబీఓ ఫలితాలలో కల్వకుర్తి పట్టణానికి చెందిన సోహైలూద్దీన్ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించాడు. బుధవారం పట్టణంలోని విస్డమ్ పాఠశాలలో అభ్యర్థిని మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, అభ్యర్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.3.50 లక్షలకు టెంకాయల వేలం

వెల్దండ: మండలంలోని గుండాలలో అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో టెంకాయల వేలం పాట నిర్వహించారు. బ్రహ్మోత్సవాల వరకు టెంకాయల విక్రయాల కోసం నిర్వహించిన వేలంలో వ్యాపారి కృష్ణ పాల్గొని రూ.3.50 లక్షలకు దక్కించుకున్నారు. లడ్డు, పులిహోరం కోసం పుష్ప రూ.3.6లక్షలు, టెంకాయల చిప్పలు జంగయ్య రూ.21,600లకు వేలం పాట పాడారు. అదేవిధంగా 2024 సంవత్సరానికి టెంకాయల విక్రయాలకు యాదగిరి రూ.1.32 లక్షలు, లడ్డు, పులిహోర రూ.1.5లక్షలకు కైవసం చేసుకున్నారు. ఆలయానికి వేలం పాటలో మొత్తం రూ.9.14 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ వివరించారు.